## జిల్లా స్థాయి కవి సమ్మేళనం

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దబాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 11న జిల్లా స్థాయి కవి సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.జూన్11న తెలంగాణ సాహిత్య దినోత్సవంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సాయంత్రం 5గంటలకు జిల్లాస్థాయి కవి సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని ఆసక్తిగల కవులు,రచయితలు తెలంగాణ అస్తిత్వం తెలంగాణలో సాదించిన ప్రగతి ప్రతిబింబించేలా కవితలు ఉండాలని కలెక్టర్ అన్నారు.ఈ కవి సమ్మేళనం తెలుగు మరియు ఉర్దూ భాషలలో నిర్వహించడం జరుగుతుందని,ఇందులో పాల్గొనదలచిన వికారాబాద్ జిల్లాలోని కవులు రచయితలు తమ కవితలను స్వీయ కవితగా ధ్రువీకరిసూనత ఈ నెల 9వ తేది వరకు (శుక్రవారం ) సాయంత్రం 5 గంటల వరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని కలెక్టర్ సూచించారు.కవితలు పద్యం,గేయం,వచన కవిత వివిధ ప్రక్రియలలో ఉండవచ్చున్నారు.కవిత గానం 3 నిమిషాలలో పూర్తయ్యే విధంగా తమ కవితలు ఉండేలా కవులు జాగ్రత్తలు వహించాలని అన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# కెసిఆర్ నాయకత్వంలో బ్రహ్మాండంగా అభివృద్ధి

**-కెసిఆర్ సర్కార్ సాగునీరు, తాగునీరు గోసలు తీర్చారు**
**-ప్రజలందరూ కెసిఆర్ వెంట నిలబడాలి**
**-చీర్యాలలో మంత్రి మల్లారెడ్డి**



చీర్యాలలోని నాట్కాన్ చెరువులో ప్రత్యేక పూజలు చేస్తున్న రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి

**కీసర, జూన్7, ప్రభాతవార్త:**
కేసీఆర్ నాయకత్వంలో బ్రహ్మాండంగా రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుదవారం మండలంలోని చీర్యాల గ్రామంలో నీటి పారుదల శాఖ ఆద్వర్యంలో జరిగిన సాగునీటి దినోత్సవ కార్యక్రమం ఎంఎల్ఎన్ గార్డెన్స్‌లో జరిగింది.అనంతరం నాట్కాన్ చెరువులో ప్రత్యేక పూజలు చేసి చాపలను పట్టారు.ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాకముందు పరిస్థితి ఎట్లా ఉంది నేడు ఎట్లా ఉంది అని మన కళ్ల ముందు కనబడుతుందన్నారు.నాడు నీటి కోసం గోసలు పడ్డాం.. పంటలకు నీరు లేక ఒక్క పంట పండించడానికి రైతు అల్లాడి పోయేవారు కానీ నేడు ఎంత గొప్పగా నీరు అందుతున్నది అనేది మనందరికి తెలుసన్నారు.చెరువుల పునరుద్దరణ జరిగితే అన్ని కాలాల్లో నీళ్ల సమృద్దిగా ప్రజలకు అందుతాయి అనే గొప్ప ఆలోచనతో మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని చేపట్టి నేడు ఆ ఫలితాలను పొందుతున్నామన్నారు.మనిషిని నిత్యం అన్నం లేక పోయినా ఉంటాడేమో కానీ నీరు లేకుండా ఉండలేరన్నారు.కెసిఆర్ రాబోయే రోజుల్లో నీటి అవసరాన్ని బట్టి కాళేశ్వరం ప్రాజెక్ట కట్టి తెలంగాణలో మూడు పంటలకు నీరు అందించి అన్నపూర్ణగా మార్చారన్నారు. చెరువుల పునరుద్దరణ, మంచినీరు అందించడం అనేది కేసిఆర్ నాయకత్వంలో సాధ్యమేంది తప్ప గత పాలకులకు చేతకాలేదన్నారు.గతంలో మనకు వారం రోజులకు ఒకసారి నీళ్ల వచ్చేవి నేడు ఆ దుస్థితి లేదన్నారు.మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా ఇచ్చిన చరిత్ర కేవలం కేసీఆర్ గారిదన్నారు.తెలంగాణ ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కేసీఆర్ నాయకత్వంలో నడుస్తున్నామన్నారు.తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు చేప పిల్లలను అందిస్తుందన్నారు.చెరువు మీద ఆదారపడిన ప్రతి ఒక్కరికి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు.కేసీఆర్ అన్ని రకాలుగా సబ్బండ వర్గాలకు ఆదుకుంటున్నారన్నారు.సంక్షేమంలో ఆసరా, కేసీఆర్ కిట్,చేప పిల్లలు,గోర్లు ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందంచి ప్రజలను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్న మహానాయకుడు కెసిఆర్ అన్నారు.తిన్న రేవును తలవాలంటరు కేసీఆర్ చేస్తున్న అభివృద్ది సంక్షేమాన్ని ప్రజలు యాదిపెట్టుకొని కేసీఆర్ వెంట నిలబడాలన్నారు.

దళితబంధు పథకం కింద 1100 వందల మందికి ఇస్తామన్నారు.గృహలక్ష్మీ పథకం ద్వారా నిరుపేద ప్రజలకు 3 లక్షల రూపాయలు అందించబోతున్నామన్నారు.పేద ప్రజలకు ఎం కావాలో సీఎం కేసీఆర్‌కి తెలుసన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పి చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్,ఎంపిపి మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ,సర్పంచ్‌లు తుంగ ధర్మేందర్, నాయకపు మాధురి,ఎంపిటిసి తటాకం నారాయణశర్మ,మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి,ఇరిగేషన్ అధికారులు,వార్డు సభ్యులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించిన ఘనత సిఎం కెసిఆర్‌దే

**-రైతులను రైతు బంధుతో ఆదుకున్న ఏకైక ప్రభుత్వం మాదే**
**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడి**



మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



పాల్గొన్న ఎంపి రంజీత్‌రెడ్డి అధికారులు

**చేవెళ్ల, జూన్ 7, ప్రభాతవార్త**
రైతులకు సాగునీరు అందించిన ఘనత సిఎం కెసిఆర్‌దేనని, రైతులను రైతు బందుతో అదుకుంటున్న ఏకైక ప్రభుత్వం మాదేనని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడించారు.బుదవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్బంగా చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ నాడు రైతులు నీరు లేక కంట తడి పెట్టారని, ప్రస్తుతం పోలంలోనీరును చూసి అనంతబాష్పాలతో సంతోషంగా ఉన్నారన్నారు. వ్యవసాయ రంగం దశను మార్చిన సిఎం కెసిఆర్‌కు ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలన్నారు. సాగునీరును అందించి తెలంగాణను సస్యశ్యామలం చేశామన్నారు.పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి 60 లక్షల ఎకరాలకు నీరును అందించామన్నారు. తెలంగాణలో ఏటు చూసిన పచ్చని పంటపోలాలతో కళాకళాడుతున్నాయన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు నిర్మాణం చేపట్టెందుకు సిద్దంగా ఉన్న పాలమూరు రంగారెడ్డి, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వంటి నీటిపారుదల ప్రాజెక్టులను చేపట్టడంజరిగిందన్నారు.మెరుగైన నీటి వినియోగసామర్థ్యం,పంట ఉత్పాదకతను సాధించడానికి నీటి పారుదల వ్యవస్థల సమర్ధవంతమైన అపరేషన్, నిర్వహణ లక్ష్యాన్ని సాధించడానికి సమగ్రంగా నీటిపారుదలను సమకుర్చామన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపి రంజీత్‌రెడ్డి,చేవెళ్ల ఆర్డిఓ వేణుమాదవరావు, జడ్పిటిసి మర్పల్లి మాలతీ, సర్పంచ్ శైలజ,వైఎస్ ఎంపిపి శివప్రసాద్,ఎంపిటిలఫోరం అద్యక్షుడు బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, మండల పార్టీ అద్యక్షుడు ప్రభాకర్,సర్పంచుల ఫోరం అద్యక్షుడు శివారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు,నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## గురుకులాల్లో ఇంటర్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**మొయినాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:**
రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీల భర్తీకి 2023 మార్చిలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల రంగారెడ్డి, హైదరాబాద్‌ప్రాంతీయ సమన్వయాధికారి డా.శారదా వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు తమ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి రూ.100 రుసుము చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు స్వీకరించేందుకు చివరి తేదీ ఈ నెల 15వ తేదీ అని ఆమె తెలిపారు. దరఖాస్తుదారులు గ్రామీణ ప్రాంతాల వారు అయితే తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారు అయితే రూ.2 లక్షలు ఉండాలని, 2023 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాల వయస్సు నిండరాదని తెలిపారు. ఈ అర్హతలను చూసుకుని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శారదా వెంకటేష్ ఆ ప్రకటనలో తెలిపారు.

# కనులపండువగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



షాబాద్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

**షాబాద్, జూన్ 7, ప్రభాతవార్త :**
షాబాద్‌లో మూడవ రోజు బొడ్రాయి ప్రతిష్ఠాపన బుధవారం ఉత్తరాషాడ నక్షత్రమున మూర్తి హోమాలు, పూర్ణాహుతి,పారాయణాలు యంత్ర ప్రతిష్ఠాపన, బొడ్రాయి ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు వేద పండితులతో కార్యక్రమాలు చేయించారు. అనంతరం పోతురాజుల విన్యాసాలు, మహంకాళి వేషధారణలతో షాబాద్‌లో బోనాలతో శోభయాత్రగా బయలుదేరి బొడ్రాయి వద్దకు వచ్చి నైవేద్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీసీబీ చైర్మెన్ మనోహర్‌రెడ్డి, జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మిరాజేందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మెన్ నర్సింగ్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మెన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, సర్పంచ్ తమ్మలి సుబ్రమణ్యేశ్వరి, రవీందర్, ఎంపీటీసీలు గుండాల ఆశోక్, కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు, దండు రాహుల్‌గుప్తా, పొన్న వెంకట్‌రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద మూడు రోజుల పాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

**- నేటి నుంచి చేప ఆహార ఉత్సత్తుల మేళా**
**-జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మృగశిర కార్తె, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లు**



శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయం పక్కనే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో స్టాల్స్‌లో ఏర్పాటు చేయనున్న చేప ఆహార ఉత్పత్తుల వంటకాల మాడల్స్ దృశ్యం

**శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జూన్ 7, ప్రభాతవార్త**
శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ ఆలయం పక్కనే మూడు రోజుల పాటు ఈ నెల 8,9,10తేదీలలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను, చేప ఆహార ఉత్పత్తుల మేళా (చెరువు కట్టపైన) నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ అధికారి బి.పూర్ణిమ పేర్కొన్నారు. మృగశిర కార్తె, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగ మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పెద్ద చెరువు దగ్గర కట్టమైసమ్మ గుడి పక్కన ఈ నెల 8,9,10 మూడు రోజుల పాటు చేప ఆహార ఉత్పత్తుల మేళాను నిర్వహించటానికి ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కోసం 10స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు, వివిధ రకాల చేపలు, రొయ్యలతో చేసిన వంట కాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. వీటిని మహిళా మత్స్యపారిశ్రామిక సంఘం సభ్యులు, నితమ్‌లో శిక్షణ తీసుకున్న మహిళలు, ఎంటర్ ప్రెవెన్సర్ పలువురు స్టాల్లో వివిధ రకాల చేప, రొయ్యల వంటకాలను తయారు చేసి వారు అమ్ముతారని ఆమె వివరించారు. వీటితో పాటు విజయడైరీ వారు, డిఆర్‌డిఓ వారు కూడ స్టాళ్లను ఏర్పాటు చేసి వారి ఉత్పత్తులను సరైన ధరలకు అమ్ముతారని ఆమె తెలిపారు. ప్రజలలో చేప, రొయ్య ఉత్పత్తుల వినియోగంను పెంచుటకు, ఆరోగ్యం, ఆహారం, ఉపాధి పలు విషయాలలో అవగాహనకు ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లా వాసులు, మత్స్య సహకార సభ్యులు అందరు విచ్చేసి ఈ మూడు రోజులు ప్రదర్శనను విజయవంతం చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి బి.పూర్ణిమ కోరారు.

## అక్రమంగా డిజీల్‌ను తరలిస్తున్న వాహనం సీజ్

**కొడంగల్,జూన్ 7ప్రభాతవార్త**
కార్నటక రాష్ట్రం నుంచి హైద్రాబాద్‌కు అక్రమంగా డిజిల్‌ను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు.వివరాల్లోకి వెళితే.. బుధవారం ఉదయం 9గంటల సమయంలో మండల పరిధిలోని రావులపల్లి చెక్‌పోస్టు దగ్గర చేపట్టిన వాహనాల తనిఖీల్లో భాగంగా కార్నటక నుంచి హైద్రాబాద్‌కు అక్రమంగా 2500 లీటర్ల డిజిల్‌ను తరలిస్తున్న టీఎస్07యుఈ7176 నెంబర్ గల వాహన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు.అనంతరం సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్‌కు సమాచారం అందించగా వారి ఫిర్యాదు మేరకు వాహనంలో డిజిల్‌ను అక్రమం గా తరలిస్తున్న ఎద్దుల శివశేఖర్‌రెడ్డి,వెంకట్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు తప్పని తిప్పలు



ధాన్యం కొనుగోలు కేంద్రం దగ్గర పడిగాపుల కాస్తున్న రైతులు

**కొడంగల్,జూన్ 7ప్రభాతవార్త**
ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదని దళిత బహుజన శ్రామిక యునియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని కొడంగల్‌తో పాటు పెద్దనందిగామ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగిందన్నారు.ఎంతో కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఓ వైపు వర్షం భయం మరోవైపు లారీల కొరతతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల దగ్గర పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రైతులు రాంచంద్రారెడ్డి,మదన్‌సింగ్,ఎం.రాములు తదితరులు ఉన్నారు.

## కీసర బాలాజీ స్వీట్‌లో పురుగులు

**కీసర,జూన్7,ప్రభాతవార్త:** కీసరలోని శ్రీ బాలాజీ స్వీట్ హౌస్‌లో పురుగులు పట్టిన స్వీట్‌లను అమ్ముతున్నట్లు బాధితుడు మదన్ బుదవారం వాపోయారు.మంగళవారం రాత్రి తన అన్న కూతురుకి స్వీట్స్ ఇప్పిద్దామని బాలాజీ స్వీట్ హౌస్‌కి వెళ్లి స్వీట్స్ కొన్నాడు. కాగా ఇంటికి వెళ్లిన తరువాత తన అన్న కూతురుకి స్వీట్స్ తినిపించగా పాప మొత్తం వాంతులు,విరోచనాలు అయ్యాయి.వెంటనే హస్పిటల్‌కి తీసుకెళ్లి చికిత్స చేయించారు.తరువాత పురుగులు పట్టిన స్వీట్స్‌ని తీసుకురాగా అప్పటికే దుకాణం మూసివేసారు. బుదవారం ఉదయం మరలా అదే బాలాజీ స్వీట్ హౌస్‌కి వచ్చి మళ్లి అవే స్వీట్స్ కొన్నాడు.అందులో కూడా మళ్లి పురుగులు రాగా ఇవి ఏమిటని అడగగా మా దుకాణంలో ఇలానే ఉంటాయి ఏవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని యజమాని దురుసుగా మాట్లాడినట్లు బాధితుడు మదన్ తెలిపారు.కాగా స్వీట్‌హౌస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.కాగా ఆహర భద్రత అధికారి శీర్విక వచ్చి బాలాజీ స్వీట్‌హౌస్‌లో తనిఖీలు చేశారు.స్వీట్స్ నమూనాను తీసుకెళ్లి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.






కీసరలోని శ్రీ బాలాజీ స్వీట్‌హౌస్‌లో పురుగులు పట్టిన స్వీట్స్

# ధాన్యం ఉత్పత్తిలో మన రాష్ట్రమే నెంబర్ వన్

**- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**
**- ప్రతి ఎకరాకు సాగునీరు అందివ్వాలన్నదే కెసిఆర్ లక్ష్యం**
**- రూ.5.4 వేల కోట్లతో పాలమూరు ఎత్తిపోతల**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, జూన్ 7, (ప్రభాతవార్త) :**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో రైతన్న స్థితిగతులు మారిపోయాయని, నేడు దేశంలోనే అధిక ధాన్యం పండించే రాష్ట్రంగా మన తెలంగాణ రాష్ట్రం అవతరించిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని కింగ్ ప్యాలెస్ పంక్షన్ హాల్‌లో సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ... ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని, ఆ దిశగానే రూ.5.4 కోట్ల నిధులతో పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా షాద్‌నగర్‌తో పాటు చుట్టుపక్కల నియోకవర్గాలకు సహితం సాగు నీరు అందించేదుకు చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో రైతాంగాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతోనే సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృషిట పెట్టి యుద్ధ ప్రాతిపదికన కాలేశ్వరం ప్రాజెక్టుని పూర్తి చేశారని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులను పూరినత చేసి రైతులకు నీళ్లను ఇస్తున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా షాద్‌నగర్ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు మల్లన్న సాగర్ నుంచి వచేన గోదావరి జాలలను కూడా అనుసందాము చేయాలనే ఆలోచనలో సీఎం కేసీఆర్ ఉన్నారని ఆయన వివరించారు. రాష్ట్రంలో కనివిని ఎరుగని రీతిలో పంటల దిగుబడి పెరిగిందని, ధాన్యము ఉత్పతినత చేడంలో మనమే దేశంలో ముందు ఉన్నామని ఆయన అన్నారు. మన వ్యవసాయ విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సుమారు 200లకు పైగా చెరువులను 32.3 కోట్లతో బాగు చేసుకున్నామని అన్నారు. గతంలో చెరువవుల మరమ్మతుల కోసం ఏళ్ల తరబడి నాయకుల చుట్టూ కార్యాలయం చుట్టూ తిరిగేదని నేడు ఆ పరిస్థితి లేదని అన్నారు. రాబోయే కాలంలోరైతుల అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు రైతులకు అందుతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## కులవృత్తుల,చేతివృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం

**-9న సిఎం కెసిఆర్ లాంఛనంగా ప్రారంభం - 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**
**-ప్రతి నియోజకవర్గకేంద్రాల్లో రెండవ విడత గొర్రెల పంపిణీ ప్రారంభించాలి -14న వైద్య,ఆరోగ్యదినోత్సవం సంబరాలు**
**-వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు**





మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న దృశ్యం
మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, పలువురు అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జూన్ 7, ప్రభాతవార్త**
బిసి కులవృత్తుల,చేతివృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం పొందటం కోసం సాయంత్రం వరకు ధరఖాస్తులు చేసుకున్న వాటిని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి లబ్దిదారుల ఎంపిక చేయాలని సంబంధిత అధికారులకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ సూచించారు. ఈ నెల 9వ తేదీన బిసి కుల,చేతి వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయంను సిఎం కెసిఆర్ లాంఛనంగ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బుధవారం నగరం నుంచి రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సంగారెడ్డి నుంచి మంత్రి హరీశ్‌రావులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని బిసి కుల వృత్తుల గురించి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించటం జరిగింది. అయితే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి అభిషేక్ ఆగస్త్యలు పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీన సంక్షేమ సంబరాలతో పాటు బిసి కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయంను సిఎం కెసిఆర్ లాంఛనంగ ప్రారంభిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆ వీడియో కాన్ఫరెన్స్ తరువాత ఈ సందర్భంగ జిల్లా అధికారులతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ మాట్లాడుతూ బిసి కుల,చేతి వృత్తుల వారు ఆన్‌లైన్‌లో సాయంత్రం వరకు ధరఖాస్తులు చేసుకున్న వాటిని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి లబ్దిదారులను ఎంపిక చేయాలని అన్నారు. ఈ నెల 9న సిఎం కెసిఆర్ లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకాన్ని లాంఛనంగ ప్రారంభిస్తారని అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ధరఖాస్తులను స్వీకరించిన తరువాత విచారణ చేపట్టి ప్రతి నెలా దశల వారీగ లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 9న సంక్షేమ పథకాల సంబరాల సందర్భంగ రెండవ విడత గొర్రెల పంపిణీ అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాల పంపిణీ, బిసి కులవృత్తులకు ఆర్థిక సహాయం, కళ్యాణలక్ష్మి,షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 14న వైద్య దినోత్సవాన్ని ఘనంగ నిర్వహించేందుకు పండుగ వాతావరణంలో ఘనంగ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వైద్య విద్యార్థులను వేడుకలకు ఆహ్వానించాలని, ఆరోగ్యశ్రీ సేవలు, దయాల్సిస్, కంటి వెలుగు, కెసిఆర్ కిట్ లబ్దిదారులు పాల్గొనేలా చూడాలని అన్నారు. వైద్యశాఖలో మెరుగైన సేవలు అందించిన అధికారులకు, ఎఎన్ఎంలకు, ఆశావర్కర్లకు అవార్డులు అందించాలని అన్నారు. వైద్య శాఖలో పనిచేసే మహిళా ఉద్యోగులకు చీరెలు పంపిణీ చేయాలని, ఏఎన్ఎంలకు బిపి యంత్రాలు అందించాలని ఆయన సూచించారు. 24జిల్లాల్లో కెసిఆర్ న్యూట్రిషన్ పథకాలు ప్రారంభించాలని కలెక్టర్ అమోయ్‌కుమార్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, జిల్లా సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప కాలనీలో యువకుడి ఆత్మహత్య

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త:**
జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గహకల్ప కాలనీలోని బ్లాక్ నెంబరు 70, ప్లాట్ నెంబరు 15లో నివాసం ఉంటున్న స్వర్గీయ వెంకన్న కుమారుడు మల్లాల జాషువా ( 19 ) ఇంట్లో ఎవరు లేని సమయంలో తన గదిలోకి వెళ్లి చీరతో మెడకు కట్టుకుని సీలింగ్ ఉనుపరాడుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నగరంలోని గాంధి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు నగరంలోని అల్వాల్‌లోని ఓ బేకరిలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీసీ పోలీసులు తెలిపారు.

## తూంకుంట, బాబగూడ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం



తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన బడిబాట కార్యక్రమం పాల్గొన్న కౌన్సిలర్ బి.రాజుయాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

**శామీర్‌పేట, జూన్ 7, ప్రభాతవార్త**

తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వారి ఆధ్వర్యంలో ప్రొ.జయ శంకర్ బడిబాట కార్యక్రమం జరిగింది. బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు. బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని, పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట సందర్భంగ గ్రామంలో పర్యటించిన స్థానిక కౌన్సిలర్ బి.రాజుయాదవ్ తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వం పాఠశాలలో చేర్పించాలని, బడికి పంపాలని కోరారు. బుధవారం రోజున ప్రైవేట్ పాఠశాలల నుంచి ఆరుమంది పిల్లలను జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజుయాదవ్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు తిరుమలేశ్, అమీనా, మంజుల, శైలజ, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు. ..బాబగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిధిలో ప్రొ.బడిబాట కార్యక్రమం బుధవారం జరిగింది. శామీర్‌పేట మండలంలోని బాబగూడ గ్రామంలో శామీర్‌పేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలబాయి ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించటానికి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టిందని శామీర్‌పేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలబాయి పేర్కొన్నారు. 5 నుంచి 15సంవత్సరాలలోపు బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించటానికి గ్రామంలో బడిబాట నిర్వహించి తల్లిదండ్రులను కలిసి పిల్లలను చేర్పించటానికి మాట్లాడటం జరుగుతుందన్నారు. బడిఈడు పిల్లల చేత పనులు చేయించటం నేరమని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అంగన్‌వాడి కేంద్రం నుంచి ముగ్గరు పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు బాబగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూస మురళి, అంగన్‌వాడి టీచర్ వినోద, సిఆర్‌పి దప్పు సుజాత, శామీర్‌పేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఊరూరా చెరువుల పండుగ

**శామీర్‌పేట, జూన్ 7, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగ బుధవారం సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం జరుగుతుందని అందరు పాల్గొని విజయవంతం చేయాలని శామీర్‌పేట మండల ఎంపిడిఓ జి.వాణి కోరారు. అదే విధంగ శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ ఆలయం పక్కనే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ (చేపల ఆహార ఉత్పత్తి వంటకాలు) కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి,జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొననున్నారు.

## అంగన్‌వాడీలకు బిఎల్‌ఓ విధులను రద్దుచేయాలి



ఘట్‌కేసర్ మండల కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:**

అంగన్‌వాడీ టీచర్లకు అదనపు విధులు కేటాయించకూడదని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిపి చాంబర్‌లో మంగళవారం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి అంగన్‌వాడీ టీచర్ల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీలపై అధికారుల వేధింపులు అధికమయ్యాయని, వారికి బిఎల్‌ఓ విధులు రద్దు చేయాలని, సొంతడబ్బులతో మొబైల్‌డేటా, జిరాక్స్ ఖర్చులు భరిస్తున్నారని వారు వాపోయారు. పాలు, గుడ్లు సకాలంలో రాక ఇబ్బందులు వస్తున్నాయని తమకు ఉన్న విధులకు అదనంగా పనులు చెబుతున్నారని తమకు బిఎల్‌ఓ విధులను రద్దు చేయాలని వారు కోరారు.



(ఘట్‌కేసర్–ప్రభాతవార్త)
ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం జరుగనున్న ఊరురా చెరువుల పండుగ కార్యక్రమానికి సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్న మేడ్చల్ డీపీఓ రమణామూర్తి, ఘట్‌కేసర్ ఎంపిఓ నందకిషోర్

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**సిద్దిపేట రూరల్, జూన్ 7,ప్రభాతవార్త :** విద్య సంవత్సరంలో ఎలాంటి ఒడిదొడుకులులేకుండా సరైనా విధానం అవలంభించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజేందర్‌రెడ్డి, మల్లికార్జున్ అన్నారు. ఈ మేరకు బుధవారం డీఈఓ కార్యాలయంలో సెక్టోరియల్ అఫీసర్ రామస్వామికి వినతి పత్రం అందజేశారు. అలాగే గత సంవత్సరంలో రద్దయిన బిల్లులకు మళ్లీ రీ టోకేన్ జారీ చేయాలని కోరుతూ డిటిఓ అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటుపై సరైన విధానం రూపొందించి ఈనెల 12కు ముందే అ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. రాగిజావ పంపిణీకి స్కూల్ పాయింట్‌లోనే మెటీరియల్, అలాగే ఉచిత పాఠ్యపుస్తకాలు త్వరగా అందించాలన్నారు. 317 జీవో అమలులో అధికారుల తప్పిదంవల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. విద్యరంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు.

## దుబ్బాక నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

**మిరుదొడ్డి, జూన్ 6, ప్రభాతవార్త :** ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంజీరా యూత్ క్లబ్ సౌజన్యం తో ఈనెల 10,11వ తేదీలలో దుబ్బాక నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మంజీరా యూత్ క్లబ్ అధ్యక్షులు తోట వెంకటరెడ్డి, ప్రజాహిత ఫౌండేషన్ సభ్యులు స్వామి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, టోర్నమెంట్‌లో గెలుపొందినవారికి నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 9వతేదీ సాయంత్రం 6 గంటలవరకు టీంల ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు.

## ఆరోగవంతమైన జీవనశైలిని అందించనుంది

**శామీర్‌పేట జూన్7,ప్రభాతవార్త :** హెల్తీ అండ్ ఫీట్ ఇండియాను ప్రోత్సహించాలని దేశపు కలను మద్దతు మరియు సంబరం చేయడానికి దేశపు సెల్లర్స్ నుండి యోగాకు అవసరమైన సాటిలేని ఎంపికను తీసుకువచ్చే యోగా స్టోర్ ఆరంభాన్ని అమేజాన్ ఇండియా ప్రకటించింది. గౌరవనీయ శ్రీ సర్బానంద సోనోవల్,ఆయుష్ మరియు రేవులు,షిప్పింగ్ ,జల మార్గాలు శాఖ మంత్రి భారత ప్రభుత్వంచే అధికారికంగా ఆఫ్ లైన్‌లో ఆరంభించడబడిన ఈ స్టోర్ కస్టమర్స్ ఆరోగ్యవంతమైన జీవనశైలిని అనుసరించడానికి ఒక అవకాశం ఇవ్వడమే కాకుండా ఆరోగ్యం మరియు శారీరక ధారుఢ్యం శ్రేణిలో వృద్ధి చెందుతున్న దేశపు బ్రాండ్స్ మరియు తయారీదారుల వృద్ధిని ప్రోత్సహించే లక్ష్యాన్ని కూడా కలిగి ఉంది.

# నెర్రలు పారిన నేలలో ఇక గోదావరి జలాలు

### ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



కెసిఆర్ ప్రసంగంతో కూడిన పుస్తకాన్ని ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్, జూన్ 7, ప్రభాతవార్త**

నిత్యం కరువు కోరల్లో విలవిల్లాడుతూ నెర్రలు బారిన నేలలతో చిక్కి శల్యమైన మెట్టప్రాంత రైతాంగానికి ఇకసాగునీటిని అందించబోతున్నట్లు హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ తీపి కబురు అందించారు. బుధవారం హుస్నాబాద్ నియోజక వర్గ కేంద్రంలోని శుభం గార్డెన్‌లో తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలలో భాగంగా నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన విజయోత్సవాల సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమైఖ్యపాలనలో మెట్టప్రాంత రైతాంగం వలసలు వెళ్లడం, గల్ఫ్ దేశాలకు వెళ్లి దుర్భర జీవితాలు గడిపిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపేందుకు ప్రాజెక్టును పూర్తి చేసి త్వరలో ప్రారంభించబోతుందని చెప్పారు. హుస్నాబాద్ ప్రాంతంలో ప్రధానంగా మహా సముద్రం గండిని పూడ్చి 14 గ్రామాలకు సాగునీటితో పాటు మంచినీటి వనరులను అందించబోతున్నట్లు సతీష్‌కుమార్ చెప్పారు. ముఖ్యమంత్రి హుస్నాబాద్ పర్యటన సందర్భంగా విచ్చేసి మహాసముద్రంగండి పనులను చేపట్టారని వెల్లడించారు. అలాగే 1.4 టిఎంసిల సామర్థ్యంగల గౌరవెల్లి ప్రాజెక్టును 10 టిఎంసిల సామర్థ్యానికి పెంచి రైతాంగానికి మేలు చేశారని కెసిఆర్‌ను కీర్తించారు. ఈ విషయంలో భూనిర్వాసితుల త్యాగాలను వెలకట్టలేనివని చెబుతూ వారికి న్యాయం చేసేందుకు ప్రత్యేకశ్రద్ద తీసుకున్నామని వారికి ఎంత చేసినా తక్కునేనని సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ ప్రచురించిన కోటిఎకరాల మాగాణి(కెసిఆర్ ప్రసంగంతో కూడినది) సభా వేదికపై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ అర్బన్ జిల్లా జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధాకర్, సిద్దిపేట జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, అక్కన్నపేట జడ్పీటిసి సభ్యురాలు భూక్య మంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కట్కూర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ శంఖుస్థాపనలు

## కట్కూర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

**అక్కన్నపేట, జూన్ 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కట్కూర్ గ్రామంలో సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి అధ్యక్షతన చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణంతోపాటు విశాల పరపతి సహకార సంఘం భవన నిర్మాణానికి బుధవారం సహకార చైర్మన్ కొండూరి రవిందర్‌రావు సమక్షంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ భూమిపూజ నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాడ్డాక చేపట్టిన అభివృద్ధితో పాటు నూతనంగా ఏర్పడిన మండలాలు అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, సింగిల్ అధ్యక్షులు పంజా రాజయ్య, ఎంపిపి మాలోతు లక్ష్మిభీలూనాయక్, జడ్పీటిసి సభ్యురాలు భూక్య మంగశ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజనితిరుపతిరెడ్డి, ఎంపిటిసి సభ్యులు సుదోష్ణ, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు, ఎంపిడివో సత్యపాల్‌రెడ్డి, ఎంపివో కవికుమార్, కార్యదరి ్శ గుగులోతు మోహన్‌నాయక్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దండుపాళ్యం గ్రూపులుగా కళాశాల యాజమాన్యాలు



మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు రాజూనాయక్

**హుస్నాబాద్, జూన్ 7, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రాంతంలో దండుపాళ్యం బ్యాచ్‌లుగా మారిన కళాశాల యాజమాన్యాలు ఇష్టారీతిన కోట్లకు కోట్లు ప్రజల నుండి కొల్లగొడుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గుగులోతు రాజూనాయక్ మండిపడ్డారు. ఇలాంటి దోచుకుతింటున్న కార్పొరేట్ తరహా కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాలోతు సత్యంనాయక్,భూక్య మోతీలాల్‌నాయక్,భూక్య క్రిష్ణనాయక్,భూక్య వీరన్న నాయక్ తదితరులున్నారు.

## బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి

**నర్సాపూర్, జూన్ 7, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా నడుస్తున్నాయని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రూ. 30 లక్షలతో నిర్మిస్తున్న సిసిరోడ్ల పనులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హయాంలో నర్సాపూర్ మున్సిపాలిటీలో అన్నివార్డులలో సిసి రోడ్లను నిర్మించామని తెలిపారు. అంతేగాక మురికి కాలువల, డ్రైనేజీ పనులను సైతం చేసినట్లు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో సిసి రోడ్ల నిర్మాణాలకుగాను అధికంగా నిధులు కేటాయించి నిర్మించినట్లు తెలిపారు. అలాగే వివిధకులాల కమ్యూనిటిహాల్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మళ్లీ రాష్ట్రంలో అధికారం అప్పగించాలని మళ్లీ కెసిఆర్ మూడవసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్ లక్ష్మినాగేశ్,ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగరావు,పిఆర్ ఏఈ స్వామిదాస్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, కౌన్సిలర్ గోడ రాజెందర్, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు హాబీబ్‌ఖాన్, జ్ఞానేశ్వర్,జగదీశ్వర్, కృపాచారి, ఆంజనేయులుగౌడ్, తదితరు పాల్గొన్నారు.



సిసి రోడ్లనిర్మాణ పనులు ప్రారంబించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

## బిజెపి నాయకులు ముందస్తు అరెస్టు



పోలీసు ఠాణాలో భారతీయ జనతా పార్టీ నాయకులు

**కొల్చారం, జూన్ 7, ప్రభాతవార్త:** చిలిపిచెడ్ మండలంలోని అజ్జమరి గ్రామానికి బుధవారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, నర్సాపూర్ శాసన సభ్యులు మధన్‌రెడ్డిలు హాజరవుతున్నందున భారతీయ జనతా పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి కొల్చారం పోలీసు ఠాణాకు తరలించారు. కొల్చారం పోలీసుఠాణా ఆవరణలో బిజెపి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్న తరుణంలో బిజెపి నాయకులను ముదస్తుగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వరి కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద ఉన్న వరి ధాన్యంను పూర్తిగా కొనుగోలు చేయకపోతుండటాన్ని మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకుపోయి రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలుసుకున్న బిఆర్‌ఎస్ నాయకులు తమను ముందస్తుగా అరెస్టు అయ్యేలా పోలీసులను వాడుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే శాసన సభ ఎన్నికల్లో భిజెపి జండా ఎగరడం తథ్యమని మండల పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## విపిఎల్ సీజన్ టోర్నీని ప్రారంభించిన జడ్పీటిసి



వరిగుంతంలో క్రికెట్ టోర్నిని ప్రారంభిస్తున్న జడ్పీటిసి సంతోష్‌కుమార్

**కొల్చారం, జూన్ 7, ప్రభాతవార్త:** మండలంలోని వరిగుంతం గ్రామంలో బుధవారం విపిఎల్ సీజన్–3 వరిగుంతం (ప్రీమియర్ లీగ్)ను జడ్పీటిసి సభ్యులు మేఘమాల సంతోష్‌కుమార్ బ్యాటింగ్ చేసి టోర్నిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేఘమాల సంతోష్‌కుమార్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 5 జట్లు తలపడుతున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడా స్పూర్తితో ఆటల్లో తలపడాలని సూచించారు. క్రీడలతో శారీరాక దారుఢ్యం పెరగడం తోపాటు క్రమశిక్షణ అలవడుతుందని, సోదర, స్నేహభావులు కల్గుతాయన్నారు. క్రీడాకారులకు తన వంతు సహకారం రౌండ్ ద క్లాక్‌గా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు శేఖర్‌గౌడ్, వడ్ల శ్రీనివాస్, నబుముద్దీన్, సిద్ధి రాములు, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఊరూర చెరువుల పండగను విజయవంతం చేయండి

### నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

**నర్సాపూర్, జూన్ 7, ప్రభాతవార్త:** దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న నిర్వహిస్తున్న ఊరూర చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ అన్నారు. బువవారం ఆయన రాయరావు చెరువు వద్ద ఊరూర పండగ ఏర్పాట్లను పరిశీలించారు. సభ నిర్వహణ స్టేజీని, బతుకమ్మ ఆట స్థలాన్ని పరిశీలించి పనులు వేగంగా చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఊరూర చెరువు పండగ కార్యక్రమంలో భాగంగా ముందుగా నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం నుంచి రాయారావు చెరువు వరకు బతుకమ్మ, బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. అంతేగాక కట్టమైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊరూర చెరువుల పండగ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని వెంకట్ గోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



చెరువు పండగ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెంకట్‌గోపాల్ తదితరులు

# చెరువు పండగను విజయవంతం చేయండి

### రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 7, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా నిర్వహిస్తున్న మన చెరువు పండగను విజయవంతం చేయాలని రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం నాడు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పాటు మెప్మా రిసోర్స్ పర్సన్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గురువారం నాడు పట్టణంలోని మల్లె చెరువు కట్టపైన తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువుల పండత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బోనాలు, బతుకమ్మలు, కోలాటాలు లాంటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు వెయ్యి మందికి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు ప్రతి ఒక్క అధికారి సహకరించి వారి వారివిధులు నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా స్థానికి మహిళా సంఘాల సభ్యులందరూ పెద్ద ఎత్తున పాల్గొనేటట్లు మెప్మా ఆర్‌పిలు చూడాలని వారందరికి మున్సిపల్ అధికారులు సహకరిస్తారన్నారు. కాగా ఈ కార్యక్రమానికి పట్టణానికి సంబంధించిన వివిధ చైర్మెన్‌లు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, సిబ్బంది, మాజీ చైర్మెన్‌లు, కౌన్సిలర్‌లు, డైరెక్టర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ అన్నీ పార్టీల నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, మహిళలు, ప్రజలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, మున్సిపల్‌సిబ్బంది, మెప్మా ఆర్‌పిలు రజిత, వసంత,మర్కు లావణ్య, రూప, స్వాతి, స్రవంతి, లావణ్య, విజయశ్రీ, కవిత, తరంగిణి, బాల్‌లక్ష్మి, పలువురు పాల్గొన్నారు.

## బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

**గజ్వేల్ టౌన్, జూన్ 7, ప్రభాతవార్త :** మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి పార్లమెంటు సభ్యత్వ నుంచి తొలగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కేవలిలు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ అధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి గ్రౌండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో కొంత కాలంగా రెజ్లర్లు లైంగికంగా వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టు చేసి న్యాయం చేయాలని పోరాటం నిర్వహిస్తున్నా కేంద్ర పెద్దలు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర పెద్దలు స్పందించి బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రం, రాణిప్రభావతి, శేఖర్, చంద్రశేఖర్, కిరణ్, బండ్ల స్వామి, రాజు, వెంకటచారి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ రంగాలలో పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, జూన్ 7, ప్రభాతవార్త:** గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కాలేజీయేట్ కమిషనర్ అదేశాల మేరకు ప్రిన్సిపాల్, ప్రొ॥ పీవీ ఉమాశశి ఆధ్వర్యంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ శ్రీలత వివిధ రంగాలలో బుధవారం పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ధి ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రజాహిత సంక్షేమ పథకాలు వ్యాసరచన పోటీలలో శృతి ప్రథమ బహుమతి, ఎం.చందన ద్వితీయ బహుమతి సాధించారు. తెలంగాణ సంస్కృతి, సంగీతం, సాంప్రదాయాలు, వంటలు అచారాలలో వక్తుత్వ పోటీలలో స్నేహంజలి ప్రథమ బహుమతి సాధించారు. పాటలు, డ్యాన్స్, డ్రాయింగ్ పోటీలలో శ్రీవాణి, ప్రవళిక, రేఖ, సంధ్యారాణి, మానసలు బహుమతులను గెలుచుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జయరాజు, డాక్టర్ అనిత, డాక్టర్ జ్యోతి, సుమలత, ఉమారాణి, సరోజన, నీలమ, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంకష్టహర చతుర్ధి



వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్, జూన్ 7 (ప్రభాతవార్త):** సంకష్టహర చతుర్ధి సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని వినాయకుని దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఎల్ల నారాయణ సంతోష దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి నెల సంకష్టహర చతుర్ధి సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వినాయకునికి పూజలు నిర్వహిస్తే సకల పాపాలు హరిస్తాయని అన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించిన ఎల్ల నారాయణ సంతోష దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుర్రె లలిత సాయిరెడ్డి, నాందాసు ఇందిరా ప్రభు, మామిడి లక్ష్మి నర్సయ్యగౌడ్, ప్రొద్దుటూరి నరేందర్, మామిడి సురేష్‌గౌడ్, చంద రమేష్, చంద సందీప్, శేకరయ్య, రవీందర్, గోపిశెట్టి రవి, కుర్రె కరుణాకర్‌రెడ్డి, కిష్టాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిది



దామరకుంటలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**మర్కుక్, జూన్ 7 (ప్రభాతవార్త):** బడి బయట పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపై ఉందని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.రమేష్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దామరకుంట గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించే సామాజిక బాధ్యత మన అందరిపై అందన్నారు. ఐదేళ్ళు నిండిన పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపించాలని కోరారు. మన ఊరు బడిని బలోపేతం చేసుకోవాలని, ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. మన ఊరు మన బడి పథకం కింద ప్రభుత్వ బడుల్లో సకల వసతులు సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, కేశవరెడ్డి, సుభాస్, వైవిఎన్.రెడ్డి, శ్రీశైలం, రేఖ, లక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి దేవాలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట

### -స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

**ములుగు, జూన్ 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొట్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక సర్పంచ్ గంగిశెట్టి గణేష్‌గుప్త ఆధ్వర్యంలో శ్రీ భవానంద ఆశ్రమ పురోహితులు అప్పాల సత్యనారాయణశర్మ, విఠల్‌శర్మ, రసరాజశర్మ, రాధాపతిశర్మ, భావానందశర్మల మంత్రోశ్చరణల మధ్య మల్లికార్జునస్వామి, లింగం, నంది విగ్రహాల ప్రతిష్ట నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ళ శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ గణేష్‌గుప్త శాలువాలతో ఘనంగా సన్మానించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, యువజన నాయకుడు జుబేర్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## నందిగామలో ఇరుకు రహదారులకు మహర్దశ

**-జేసిబితో పనులు చేపట్టిన సర్పంచ్ వెంకట్ రెడ్డి**



ఆరవ వార్డులో జేసిబితో అరుగులను కూల్చి రహదారి విస్తరణ పనులు చేపట్టిన సర్పంచ్

**నందిగామ జూన్7,ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన నందిగామ గ్రామ పంచాయతీ 6వ వార్డులోని ఇరుకు ఇరుకుగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఇంటి ముందు అరుగులను,గోడలను తొలగిస్తూ సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి సౌకర్య వంతంగా తీర్చిదిద్దుతున్నారు.గ్రామపంచాయతీ నిధులు సుమారు రూ. 35లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు సర్పంచ్ శ్రీకారం చుట్టారు.గత ఎన్నో ఎళ్లనాటి శిథిలావస్థమైన అండర్ డ్రైనేజీలను పునరుద్ధరిస్తూ కొత్త పైపులను బిగించారు.కాలనీలో సిమెంట్ రోడ్లు,అండర్‌డ్రైనేజీ, వీధిలైట్లు, మంచినీటి పైపులైను పునరుద్ధరిస్తూ మౌలిక వసతులను కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేక్కొండ కుమార్ గౌడ్,వార్డు సభ్యులు ఈశ్వర్ యాదవ్,బి.శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ చించోటి కృష్ణా గౌడ్,సింగిల్ విండో డైరెక్టర్ దార సురేష్,నాయకులు ఎర్రగారి రమేష్, చెన్నగళ్ల నర్సింహ్మ,చెన్నగళ్ల సంజీవ,ఎండి రియాజ్,కోర్న గోపాల్, శివ్వ గల్ల రమేష్,జాంగారి రాములు,కోర్న నర్సింలు,కాంట్రాక్టర్ భిక్షపతి గ్రామ స్థులు,తదితరులు పాల్గొన్నారు.

### చేవెళ్ల యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శిగా సుశాంత్ ఎన్నిక

**చేవెళ్ల, జూన్ 7, ప్రభాతవార్త**
చేవెళ్ల యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శిగా సుశాంత్‌ను ఎన్నిక చేశారు.చేవెళ్ల యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శిగా సుశాంత్‌ను నియమక పత్రాన్ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అద్యక్షుడు శివసేనారెడ్డి అందజేశారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన చేవెళ్ల యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి సుశాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని మరింతగా పటిష్టం చేస్తామన్నారు. గ్రామాలల్లో పార్టీ పటిష్టంగా ఉందని, పార్టీని మరింతగా ముందుకుతీసుకువెళ్లానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువజన కాంగ్రెస్‌ను బలోపేతనం చేసేందుకు శాయశక్తులు కృషి చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు.

## బిజెపి బలోపేతానికి నాయకులు కృషి చేయాలి

**-బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు భారతి బెన్‌షీయల్**



అన్నోజిగూడలో జరిగిన బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఆపార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు భారతి బెన్‌షీయల్

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త:**
బీజేపీ బలోపేతం కొరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గనేతలు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు భారతి బెన్ షీయల్ అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ సినీయర్ నేతల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు భారతి బెన్‌షీయల్ పార్టీ బలోపేతం కొరకు దిశ నిర్దేశం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, మోహన్ రెడ్డి,మల్లారెడ్డి, నానావత్ బిక్కునాయక్, కాలేరు రామోజీ, మున్సిపల్ కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమ, వెంకట్ రెడ్డి, నల్ల బాస్కర్ రెడ్డి, ఆంజనేయులు,అచ్చిని నర్సింహ,పోచారం బీజేపీ అధ్యక్షుడు సురేశ్ నాయక్, మాజీ ఎంపీటీసీ కరుణాకర్,బోడ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## దాతల సహాయంతో ఆలయాల అభివృద్ధి



పోచమ్మ ఆలయానికి షెడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న 5వ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్

**కీసర,జూన్7,ప్రభాతవార్తః**
దాతల సహయంతో ఆలయాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని దమ్మాయిగూడ మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్ గౌడ్ అన్నారు.బుధవారం వార్డు పరిధిలోని పోచమ్మ గుడి వద్ద కాలనీ దాతల సహకారంతో రేకుల షెడ్డుకు శంకుస్దాపన చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీ ప్రజలు ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.ఆలయాలను అభివృద్ధి చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జేఆర్ గణేష్, సురేష్,నర్సింగ్,లక్ష్మణ్ సింగ్ చారీ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శం

**కీసర,జూన్7,ప్రభాతవార్తః**
కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులోని గోపిక్రిష్ణ కాలనీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు.ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రతి ఒక్కరికి కంటి చూపు సమస్యలు లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కంటి వెలుగు కేంద్రానికి రోజుకు 100 మందికి పైగా పరీక్షలు చేయించుకుంటున్నారు.18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పరీక్షలకు అర్హులని తెలిపారు.కంటి వెలుగు కేంద్రంకు వచ్చే వాళ్లు ఆధార్‌కార్డు జిరాక్స్ తెచ్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్,కౌన్సిలర్ సుమిత్ర సురేష్,సింగిల్‌విండో డైరెక్టర్ భూపాల్‌రెడ్డి,కాలనీ అసోసియేషన్ సభ్యులు రామారావు,డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నాగారం మున్సిపాలిటీ 20 వార్డులో గోపిక్రిష్ణ కాలనీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ కౌకుట్ల చంద్రారెడ్డి

# దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచింది

-బిఆర్ఎస్‌ను విమర్శించే నైతిక హక్కు బిజెపి నాయకులకు లేదు
-చేవెళ్ల బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్లుగా మారారు
-బిఆర్ఎస్ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి మల్గాని నరేందర్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి మల్గాని నరేందర్‌గౌడ్

**చేవెళ్ల, జూన్ 7, ప్రభాతవార్త**
దేశానికి తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందని,తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చేందుతుంటే ఓర్వలేక బిజెపి,కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని బిఆర్ఎస్ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి మల్గాని నరేందర్‌గౌడ్ ద్వజమెత్తారు. బుదవారం చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి మల్గాని నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుంటే బిజెపి నేతలు విమర్శించడమే పనిగాపెట్టుకున్నారన్నారు. బిఆర్ఎస్‌ను విమర్శించే నైతిక హక్కు బిజెపి నాయకులకు లేదన్నారు.బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డిదీ ఇంతకీ ఏ పార్టీఅని చేవెళ్ల ప్రజలకు అనుమానం ఉందన్నారు. చేవెళ్ల బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్లుగా మారి అధికార పార్టీపై న అసత్య ఆరోపణలు చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి,కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి కన్పించడంలేదా?చేవెళ్లకు ఏం అభివృద్ధి చేశామో? వివరించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. బిఆర్ఎస్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని, ఎవరు ఎం అభివృద్ధి చేశారో అత్మపరిశిలన చేసుకోవాలన్నారు.బిజెపి నాయకులు స్దాయికి తగ్గ విమర్శలు చేయాలన్నారు. బిఆర్ఎస్ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలు అదర్శంగా తీసుకుంటే తెలంగాణలోని బిజెపి నాయకులకు మింగుడు పడటంలేదన్నారు.బిజెపి అధికారంలోకి రాకముందు చేసిన హమిలను పరిష్కరించాలన్నారు.వర్షాలతో నష్టపోయిన రైతులకు తెలంగాణ ప్రభుత్వం నష్టపరిహరం ఎకరాలకు పది వేయిల రూపాయలను అందజేస్తుం దని,చేతనైతే రైతులకు నష్టపరిహరం కింద ఎకరాకు పదివేయిల రూపాయలను బిజెపి ప్రభుత్వం కూడ అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎఎంసి వైస్ చైర్మన్ నర్సింలు, విద్యార్ధి విభాగం నియోజకవర్గ అద్యక్షుడు అత్తెల్లి రాఘవేవందర్‌రెడ్డి, ఫయాస్, అబ్దుల్ ఘని తదితరులు పాల్గొన్నారు.

# ఎదులాబాద్‌లో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

**-నేడు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠా..కళ్యాణోత్సవం**



ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబమల్లికార్జునస్వామి దేవస్థానంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న మేడ్చల్ జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని భ్రమరాంబమల్లికార్జునస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాపన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ప్రాత:కాల పూజలు, హోమాలు, మూలమంత్రజపాలు, పారాయణాలు, అభిషేకాలు, విశేషధాన్యాధివాసము, హజము, హరతి, విగ్రహాలకు ధాన్యాధివాసము, సాయంత్రం 108 మృతికా కళశాలతో మహస్నపణం, జీవతత్వకళా ప్రాణన్యాస హోమాలు, రుద్ర పంచసూక్త హోమాలు, ప్రతిష్టా హోమాదులు, రాత్రి విశేషంగా శయ్యాధివాసం, ఫల, పుష్ప, వస్త్రాధివాసాలు, హరతి, మంత్రపుష్పం, రాజోపచారాలు నిర్వహించారు. ప్రతిష్టా పురోహితులు రేవల్లి రాజుశర్మ వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రతిష్టా పూజలు జరిపారు. మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి విచ్చేసి ఆలయంలో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానంలో ప్రతిష్టించినున్న విగ్రహాలను ఆయన దర్శించుకొని పూజా వివరాలు తెలుసుకోగా ధర్మకర్తలు ఆయనను శాలువాతో సన్మానించారు. గురువారం ఉదయం యంత్ర ప్రతిష్టా శ్రీభ్రమరాంబికా, గణపతి, సుబ్రమణ్య, శ్రీచక్ర, శ్రీవీరభద్ర, సింహవాహన, శ్రీజ్ఞానసరస్వతీ, శ్రీఅంజనేయ, నవగ్రహా, జీవధ్వజస్తంభ, బలిపీఠ, శిఖర దేవతల యంత్ర ప్రతిష్టా, విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు కంట్లం శంశీయులు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కళ్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా దండెం రాంరెడ్డి



మురళి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న టిపిసిసి కార్యదర్శ దండెం రాంరెడ్డి

**ఇబ్రహీంపట్నం, జూన్ 7, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని టిపిసిసి కార్యదర్శి దండెం రాంరెడ్డి అన్నారు.మండల పరిధిలోని దండుమైలారం గ్రామానికి చెందిన రావణమోని మురళి పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకొని ఆయన కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేశారు.ఆయన వెంట ఎంపిటిసి సీతయ్య,సర్పంచ్ మల్లేశ్వరిజంగయ్య, లింగం, బుగ్గ రాములు, శ్రీరాములు,నర్సింహ్మ తదితరులున్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన క్యామ మల్లేష్



భాదిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్

**యాచారం, జూన్ 7 ప్రభాతవార్త**
యాచారం మండల కేంద్రానికి చెందిన గడల శివలింగం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ బుధవారం భాదిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతరం భాదిత కుటంబానికి రూ. 10 వేలు ఆర్ధిక సహాయం అందించారు. భాదిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాసచారి, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి వెంకటేష్, ముజాకిర్, బర్ల కృష్ణ యాదవ్, ఐవిఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల పండుగను విజయవంతం చేయాలి

**-ఎంపీడీవో విజయలక్ష్మి**



ఊరూరా చెరువుల పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్, ఇరిగేషన్ డీఈ

**యాచారం, జూన్ 7 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాగు నీటి దినోత్సవంలో భాగంగా నేడు నిర్వహించే ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప ంచాయితీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ మండలంలోని మేడిపల్లి, తక్కల్లపల్లి, మల్కీజ్‌గూడ, చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో నేడు నిర్వహించే చెరువుల పండుగను విజయవంతం చేయాలన్నారు. ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొంటున్నందున అధికారులంతా సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుచరిత, డిటి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ లిక్కి సరిత పాండురంగారెడ్డి, ఇరిగేషన్ డీఈ మంజుల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

**శంకర్‌పల్లి, జూన్ 7 ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి పేరు, ఊరు వివరాలు తెలియరాలేదు. మృతుని వయస్సు సుమారు 40 నుంచి 46 సంవత్సరాల మధ్య ఉంటుంది. మృతుడి ఒంటిపై ఇండియన్ ఆయిల్ టీషర్టు,నల్ల రంగు తెల్లటి చారల నెక్కరు ఉంది. తిండి తినకపోవడం, ఎండవేడిమి తట్టుకోలేక చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపాలిటీని అభివృద్ధిలో నడిపిస్తున్నాం

**-మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహరెడ్డి**



మేడ్చల్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తున్న చైర్మన్ దీపికా నర్సింహరెడ్డి

**మేడ్చల్, జూన్ 7. ప్రభాతవార్త ః**
మేడ్చల్ మున్సిపాలిటిని అభివృద్ధి దిశలో నడిపిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో రూ. 15 లక్షల నిధులతో చేపట్టే సిసి రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ మానస శ్రవన్‌తో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలని మౌళిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టి ముందుకు నడిపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో డిఈ విజయలక్ష్మి, పట్టణ మాజీ ఉప సర్పంచ్ నర్సింహరెడ్డి, నాయకు లు శ్రవణ్‌కుమార్ గుప్త, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయింపు

**-కేపీఆర్ఐటీ ఆర్థిక సహకారం: సర్పంచ్**



ఘణాపూర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూన 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్‌లోని సాయిప్రగతికాలనీలో భూగర్భడ్రైనేజీ నిర్మాణానికి బుధవారం ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చి 1వ వార్డు పరిధిలోని కాలనీలో డ్రైనేజీ అవుట్‌లెట్, అంతర్గత మురికికాలువ నిర్మాణం కోసం దాదాపు రూ.25 లక్షలు అందజేస్తుందని తెలిపారు. ఈమేరకు సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ వేముల పరమేశ్‌గౌడ్‌లు కొబ్బరికాయలు కొట్టి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. గ్రామపంచాయతీలో నిధులు కొరత కారణంగా కేపీఆర్ఐటీ ద్వారా ఆర్థిక సహకారం రాగా ఇక్కడ డ్రైనేజీ నిర్మిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. గత 4 ఏళ్లలో పంచాయతీ పరిధిలోనే అనేక అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మేడ్చల్‌బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వేముల సత్తయ్యగౌడ్, వార్డుసభ్యులు చిలుగూరి భాస్కర్, వేముల పద్మ, మందుల మయూరి, వర్త్య పవన్‌నాయక్, కోఆప్షన్‌సభ్యులు నానావత్ సురేశ్‌నాయక్, పైళ్ల లతరెడ్డి, కళాశాల ఎస్టేట్ ఇంచార్జ్ ఇనుగాల రవీందర్‌రెడ్డి, నాయకులు వేముల మహేశ్వర్‌గౌడ్, బాలగొని విజయ్‌గౌడ్, మందల మహేందర్‌లు పాల్గొన్నారు.

### రెండు బైక్‌లు ఢీకొని కార్మికుడు మృతి

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:** రెండు బైక్‌లు ఢీకొని ఒవ్యక్తి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ సీఐ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన గంగి శివకుమార్ సోదరునికి చెందిన హోండాయాక్టివా (టిఎస్08సిజె-టిఆర్9452) బైక్‌ను అతని వద్ద పనిచేసే కార్మికుడు జహంగీర్ రాత్రి 11:45 గంటలకు తీసుకొని అవుషాపూర్‌లోని పిపిఆర్ ఫంక్షన్‌హాలుకు వెళ్లాడు. డిన్నర్ ముగించుకొని తిరిగి కొండమడుగు వెళ్తుండగా రాత్రి 2:15 గంటల సమయంలో కేపాల్ వద్ద స్టార్ బాంక్వెట్‌హాలు వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన బైక్ (ఏపీ24 ఎక్యు-9929) ఢీకొట్టింది. దీంతో బైక్ అజాగ్రత్తగా నడిపిన కొండమడుగుకు చెందిన బిల్ల నవీన్ (25), హోండాయాక్టివా మీద ఉన్న జహంగీర్‌లు కింద పడిపోగా జహంగీర్‌కు తలకు ఇతర చోట తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్సులో గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జహంగీర్ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం 5:30 గంటలకు చికిత్స పొందుతూ గాంధీలో మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

### ఒంటరిగా ఉన్న మహిళపై దాడి.. కేసు నమోదు

**వికారాబాద్, జూన్ 07 ప్రభాతవార్త:**
ఒంటరిగా ఉన్న మహిళపై మరో మహిళ దాడి చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండల పరిధిలో గంగ్యాడ గ్రామంలో బుధవారం నాడు ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్థులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.గ్రామానికి చెందిన అమృతమ్మ(35) అదే గ్రామానికి చెందిన రమాదేవి ఇంట్లో ఎవరు లేని సమయంలో రాళ్లతో కట్టెలతో దాడి చేసి తలపై తీవ్ర గాయాలు చేసింది. గాయాలు చేయడంతో పాటు పిల్లల్ని,అమృతమ్మను చంపుతానని బెదిరించినట్టు బాధితురాలు అమృతమ్మ పోలీసులకు పిర్యాదు చేసింది దీంతో పోలీసులు బాధితురాలు పిర్యాదు మేరకు నవాబ్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



**తలకొండపల్లి జూన్7,ప్రభాతవార్త**
చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు పలుకలు పంపిణీ చేసి చిన్నారులకు అన్నప్రాసన అక్షరాభ్యాసం చేయించారు.అనంతరం చిన్నారులకు ఏ విటమిన్ సిరప్ తాగించి గర్భిణీ స్త్రీలకు గుడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనంతమ్మ ,పంచాయతీ సెక్రెటరీ చంద్రశేఖర్, ఆశావర్కర్లు,యాదమ్మ,శివలక్ష్మి,ఆయా భారతమ్మ,గర్భిణీ స్త్రీలు బాలింతలు, చిన్నారులు,తల్లులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

### స్నేహతుని కూతురు పెళ్లికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి జూన్7,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 93-94 సంవత్సరం పదవ తరగతి చదువుకు మిత్రులు తమ సహచర క్లాస్‌మెంట్ నర్సింలు 19 సంవత్సరాల క్రితం మరణించడంతో బుధవారం చనిపోయిన నర్సింలు కూతురు పెళ్లి జడ్చర్లలో జరిగింది.ఈ కార్యక్రమానికి నర్సింలు మిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి ఆర్థిక సహాయంగా 61వేల రూపాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.మంజుల, టి.రాములమ్మ, ఎంఎ అజీజ్,ఎం.కృష్ణయ్య,శంకర్ గౌడ్,రాజేందర్ రెడ్డి,యేల్లయ్య, చంద్రమౌళి,జైపాల్ యాదవ్,శేఖర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## రైతుబిడ్డ చదువులకు ఆర్థిక సాయం



మేఘనా రెడ్డికి చెక్కు అందజేస్తున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్

**తలకొండపల్లి జూన్7,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని వీరన్నపల్లి గ్రామానికి చెందిన బెక్కిరి లక్ష్మారెడ్డి గత కొన్ని రోజుల క్రితం మరణించారు.దింతో లక్ష్మారెడ్డి కూతురు మేఘనా రెడ్డిపై చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారని తెలుసుకొని బుధవారం జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ స్వయంగా విరన్నపల్లి గ్రామానికి వెళ్లి లక్ష్మారెడ్డి కూతురు మేఘనా రెడ్డి చదువు కోసం ఐదు లక్షల రూపాయలను గ్రామస్తుల ఆధ్వర్యంలో జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్,వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ మైసై,సీనియర్ నాయకులు దామోదర్,గౌడ సంఘం తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్, తుమ్మలకుంట సర్పంచ్ లక్ష్మణ్ నాయక్,వీరన్న పల్లి ఉప సర్పంచ్ కొండల్ యాదవ్,గోవర్ధన్ రెడ్డి,జైపాల్ రెడ్డి,సాయిరెడ్డి,రఘుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కామ్రేడ్ నర్సింహకి నివాళులర్పించిన సర్పంచ్

**ఇబ్రహీంపట్నం, జూన్ 7, ప్రభాతవార్త:** మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన సిపిఎం సినియర్ నాయకుడు కామ్రేడ్ మంకు నర్సింహ్మ మృతి పట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి సంతాపం తెలిపి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామి ఇచ్చారు.కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశం,మాజి సర్పంచ్ ఆనంగళ్ల యాదయ్య,నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య,ఎన్నిదుల సురేష్, పోలమోని అనిల్‌రాజు,ప్రవీణ్ తదితరులున్నారు.

### పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న సిఎం సహాయనిధి




సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యేత

**కడ్తాల్,జూన్ 07 ప్రభాతవార్త :**
అనారోగ్యరిత్యా మెరుగైన వైద్యం పొందలేని వారికి సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తుందని స్థానిక కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు మంజూరైన రూ. 28 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్న హస్తంలో నిలిచిందన్నారు.వైద్యం పొంది ఆర్థిక ఇబ్బందులు కలగకుండా పేదవారికి సీఎం సహాయనిధి ఎంతో మేలు చేస్తుందని వారన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు పేదల జీవితాలకు వెలుగు

**-మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్**

**కొత్తూర్, జూన్ 7, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కొత్తూర్ పురపాలికలోని 9వ వార్డులో వార్డు కౌన్సిలర్ మాదారం నరసింహాగౌడ్ ఆధ్వర్యంలో బుధవార ం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా అద్దాలు ఇస్తామని, అవసరమైనవారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మెన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ సోమ్లానాయక్, మాధవిగోపాల్‌గౌడ్, అనితశ్రీనివాస్‌గౌడ్, యాదయ్యగౌడ్, కొండారెడ్డి విష్ణుమూర్తి, పులిమామిడి శ్రీశైలంగౌడ్, సత్యనారాయణ, బాలుగౌడ్, డాక్టర్లు, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్

